రాజీ మార్గమే రాజమార్గం

● జాతీయ లోక్ అదాలత్‌లో జడ్జీలు

గుంతకల్లుటౌన్: రాజీ మార్గమే రాజ మార్గమని జడ్జీలు సూచించారు. స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం .బుజ్జప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 317 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో జేసీజే కోర్టు కేసులు–14, రైల్వే కోర్టు కేసులు–186, సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు కేసులు–112, పీఎల్‌సీ–5 కేసులను పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. లోక్‌అదాలత్ సభ్యులు నాగశేషు, గోపాలక్రిష్ణ, ఏపీపీ హేమలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూనస్, న్యాయవాదులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

194 కేసుల పరిష్కారం

గుత్తి: పట్టణంలోని ఏడీజే కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఏడీజే శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ చారి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకూ లోక్ అదాలత్ చేపట్టారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్ , పీఎల్‌సీ, ఎక్సైజ్ , యాక్సిడెంట్ వంటి కేసులను పరిష్కరించారు. మొత్తం 194 కేసులు పరిష్కారం చేశారు. బాధితులకు రూ. 88,40,470 పరిహారం ఇచ్చే విధంగా తీర్పు చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పీడీ రత్నం, ఏపీపీ బుసా సుధీర్‌రెడ్డి, ఏజీపీ తిమ్మారెడ్డి, న్యాయవాదులు ధనుంజయ, శ్రీనివాసులు, మనోహర్‌బాబు, మహ్మద్ రసూల్, నూర్ మహ్మద్, ఓబులేసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


గుంతకల్లులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి బుజ్జప్ప


గుత్తిలో జాతీయా లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఏడీజే శ్రీహరి

68 కేసుల పరిష్కారం

పెద్దవడుగూరు: మండలంలోని వివిధ కేసులకు సంబంధించి కక్షిదారులు శనివారం గుత్తి కోర్టులోని లోకాఅదాలత్‌కు రాగా 68 కేసులు పరిష్కారం అయ్యాయని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో 6 ఐపీసీ కేసులు, 62 పెట్టీ కేసులు రాజీ అయ్యారన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా ఘర్షణ పడకుండా సామరస్యంగా పరిష్కరించుకోవడం మంచిదన్నారు. సమస్య జఠిలంగా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకరావాలని ఆయన సూచించారు.

11 కేసుల రాజీ

గార్లదిన్నె: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు సంబంధించి 11 కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. శనివారం ఎస్ఐ మాట్లాడుతూ అనంతపురం జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించగా గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో నమోదైన 11 కేసుల్లో ఇరు వర్గాలు రాజీమార్గం ద్వారా సమస్య పరిష్కరించుకోవడంతో కోర్టులో కేసులు కొట్టేశారన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

గుంతకల్లు రూరల్: ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్లి చేయడం వల్ల వారు ఎన్నో అనర్థాలను ఎదుర్కోవలసి వస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి అన్నారు.ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయినులు మాట్లాడారు. చిన్నారులకు యుక్త వయసు రాకుండా పెళ్లి చేయడం వల్ల, వారిలో శారీరక ఎదుగదల లోపించి రక్తహీనత ఏర్పడుతుందన్నారు. దీని వల్ల తల్లీబిడ్డ ఇద్దరి ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. కావున 18 సంవత్సరాల నిండిన ఆడపిల్లకు మాత్రమే పెళ్లి చేయాలని సూచించారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందజేత


పాఠ్యపుస్తకాలు అందజేసిన వైద్యులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరంలో చదువుతున్న 50 మంది పేద విద్యార్థులకు ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్ వైద్యులు వెంకటేశ్వర్లు, హిమబిందు పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందజేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠ్యపుస్తకాలు కొనలేని పేద విద్యార్థులకు ఉచితంగా అందజేసిన వైద్యులతో పాటు పలువురు పేద విద్యార్థుల స్కూల్ ఫీజులు రూ.26 వేలు చెల్లించిన రిటైర్డ్ లెక్చరర్ రామాంజనేయులును హెచ్‌ఎం దామోదర్, ఉపాధ్యాయులు సన్మానించారు.

బలరామయ్య సేవలు మరువలేనివి


బలరామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ నాయకులు

గుంతకల్లు: అల్ ఇండియా రిటైర్డు లోకో పైలట్ అసోసియేషన్ నాయకుడు ఆర్.బలరామయ్య సేవలు మరువలేనవని అసోసియేషన్ నాయకులు కొనియాడారు. శనివారం స్థానిక మస్తాన్ పేట్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో బలరామయ్య వర్ధంతి సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డీ.రామనాయక్, ఖాజాహుస్సేన్, నాగన్న, మహేదేవ్‌రాయులు, గంగధర్, కొండయ్య, అమీర్దున్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: కాకినాడలో జూలై 8, 9, 10 వతేదీల్లో నిర్వహించే ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకట్‌నాయక్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెలికితీయడానికి, వాటిపై పోరాటాలు చేయడానికి శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌సుందర్, రోహిత్, లెనిన్, వర్మ, ఉదయ్‌కిరణ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసం తెలుగు తమ్ముళ్ల ఘర్షణ

తాడిపత్రి: కూటమి ప్రభుత్వం తొలిసారిగా జూలై 1 నుంచి పింఛన్ల పంపిణీ చేయనున్న నేపథ్యంలో టీడీపీ నేతలు ఆధిపత్యం కోసం ఘర్షణకు దిగిన ఘటన సజ్జలదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన టీడీపీ నేతలు వడ్డె రంగన్న, తలారి శీను వర్గం అదే గ్రామానికి కుమ్మర సుబ్బయ్య, తలారి ఓబులేసు వర్గం పింఛన్ల పంపిణీలో తమ మాటే చెల్లుబాటు కావాలంటూ శనివారం గొడవకు దిగారు. ఈ క్రమంలో పరస్పరం దాడుల చేసుకున్నారు. ఈ దాడుల్లో కుమ్మర సుబ్బయ్య, తలారి శీను, తలారి ఓబులేసుకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు ఘటనపై బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు.

కుట్టుమిషన్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని సోమవారం రోటరీ క్లబ్ కార్యాలయంలో నిర్వహించారు. పేద మహిళల ఉపాధి కోసం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు ఉచితంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఈ శిక్షణ ముగియడంతో 21 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ముగ్గురు మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి సుబ్రమణ్యం, ఒకేషనల్ సర్వీస్ డైరెక్టర్ రఫీ, శిక్షణా శిబిరం అధ్యాపకురాలు చంద్రిక, సభ్యులు సంజన్న, బాలసుబ్రమణ్యం, అనిల్‌కుమార్, నాగేంద్ర, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు శైలజ, రేణుక తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు అందుకున్న మహిళలు

ఎన్నికల విధుల అలవెన్సులు ఇవ్వాలి

గుత్తి రూరల్: ఎన్నికల అలవెన్సు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్, వీఆర్ఏలు డిమాండ్ చేశారు. పట్టణంలోని కార్యాలయంలో శనివారం తహసీల్దార్ భారతికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ అసిస్టెంట్ శంకర్, వీఆర్ఏ సంఘం నాయకులు చిరంజీవి, ఆంజనేయులు, నారాయణస్వామి, సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీఎల్ఓ విధులు, బాక్సుల సరఫరా తదితర పనులు చేశామన్నారు. రికార్డు అసిస్టెంట్ నుంచి పైస్థాయి అధికారుల వరకూ ఎన్నికల విధులు నిర్వహించిన వారికి ఒక నెల అదనంగా గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించడం హర్షించదగ్గ విషయమన్నారు. అయితే అందరితో పాటుగా తాము కూడా రాత్రింబవళ్లు సొంత ఖర్చులతో ఎన్నికల విధులు నిర్వహించామని, తమను విస్మరించడం ఎంత వరకూ సమంజసమన్నారు. ప్రభుత్వం స్పందించి ఒక నెల అదనంగా గౌరవ వేతనం మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏలు పెద్దన్న, జగదీష్, రాంప్రసాద్, ఆది, యుగంధర్, వినోద్ పాల్గొన్నారు.


తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేస్తున్న జేఏ, వీఆర్ఏలు

అలరించిన సంగీత విభావరి


ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

తాడిపత్రి అర్బన్: కొమ్మ కొమ్మకూ సన్నాయి... కోటిరాగాలు ఉన్నాయి, పల్లవించవా నా గొంతులో..., చినుకులారాలి వరదలై పొంగి, .వీణ వేణువైన సరిగమ విన్నావా.., తనివి తీరలేదే నామనసు నిండలేదే అని గాయకులు ఆలపించిన ఆ పాత మధురమైన పాటలు శ్రోతలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి వేడుకల సందర్భంగా శనివారం స్థానిక మార్కండేయస్వామి ఆలయం ప్రాంగణంలో స్నేహ భారతి సంగీత శిక్షణాలయం ఆధ్వర్యంలో నిర్వాహకుడు మహేష్‌స్వామి నేతృత్వంలో ఎస్పీ బాలు మ్యూజిక్ అకాడమీ సాంస్కృతిక సంస్థ సభ్యులు పల్లవించవా నా గొంతులో అనే పేరుతో స్వరార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం చిత్రపటానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సంగీత ప్రపంచానికి చేసిన సేవలను కొనియాడారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన స్వరార్చనలో ఎస్పీ బాలు ఆలపించిన కొన్ని మధుర గీతాలను స్థానిక గాయకులు ఆలపించి శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. పలువురు గాయనీ గాయలు ఆలపించిన పాటలు ఎస్పీ బాలు అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఇసుక టిప్పర్ పట్టివేత

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో శనివారం ఇసుక టిప్పర్ సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ శింగనమల మండలం తరిమెల నుంచి అనుమతులు లేకుండా అనంతపు రానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పాత కల్లూరు వద్ద పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ మీటర్ల తొలగింపు

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె, తిమ్మంపేట, పాపినే పాళ్యం గ్రామాల్లో విద్యుత్ మోటార్లకు కాంట్రాక్టర్ ఏర్పాటు చేసిన మీటర్లను రైతులు తొలగించారు. శనివారం గార్లదిన్నెలో విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించడంతో.. రైతులు వాటిని తొలగించారు. మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మీటర్లు ఎలా బిగిస్తారని రైతులు వాపోయారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించగా మోటార్లకు మీటర్లు బిగించాలని మాకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారన్నారు.

'నేను బడికి పోతా' కార్యక్రమంపై ర్యాలీ

పామిడి: పట్టణంలో శనివారం స్థానిక టీసీ హైస్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు 'నేను బడికి పోతా' కార్యక్రమం ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా చదువు ప్రాధాన్యత గురించి హెచ్‌ఎం కే రామ్‌కుమార్ వివరించారు. చదువు సంస్కారంతో పాటు గౌరవాన్ని ఇస్తుందన్నారు. అనంతరం విద్యాప్రాముఖ్యతపై నినాదాలను హోరెత్తిస్తూ పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, నాగరాజు, రామకృష్ణ, జనార్ధన్, ఎల్లప్ప, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో శనివారం రాత్రి ఓ వ్యాపారి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామానికి చెందిన ఓబయ్య అనే వ్యక్తి చీనీ కాయలు వ్యాపారం చేసే వాడు. వ్యాపారంలో నష్టం రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉండగా కుటుంబ సభ్యులు గమనించి 108 ద్వారా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా

గుత్తి: మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గుత్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం చైర్ పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు హాజరయ్యారు. సందర్భంగా మున్సిపల్ అధికారులు కౌన్సిల్ ఎజెండాలో పొందు పరిచిన ఒక్కో అంశాన్ని చదివారు. తాగునీటి సమస్య, డ్రైనేజీ, వీధి దీపాలు, వాటర్ ట్యాంకర్ల వంటి అంశాలను ఎజెండాలో పొందుపరిచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గుత్తి చెరువును త్వరలో హంద్రీ నీవా జలాలతో నింపుతానన్నారు. మున్సిపాలిటీని పాలక వర్గం సహకారంతో అభివృద్ధి చేస్తానన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేయగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

గుత్తి రూరల్: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో జూలై 1నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 సచివాలయాల పరిధిలో 6.237 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. వారికి రూ.4.18కోట్లు నిధులు వచ్చాయన్నారు. పింఛన్లను సచివాలయ ఉద్యోగులు, వీఆర్ఏ, ప్రభుత్వ పాఠశాలల్లోని జూనియర్ అసిస్టెంట్లు పంపిణీ చేస్తారన్నారు. ఎక్కడైనా సిబ్బంది తక్కువ వస్తే అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల ద్వారా పంపిణీ చేయిస్తామన్నారు. సచివాలయ సిబ్బంది 1న వేకువజామున 6 గంటల నుంచే పింఛన్ పంపిణీ ప్రారంభిస్తారన్నారు.

గార్లదిన్నె: పింఛన్లను పారదర్శకంగా పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ జూలై 1న మండలవ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. ఒక్కో గ్రామ సచివాలయ సిబ్బంది 50 మంది లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయాలన్నారు.

రుణాలు రెన్యువల్ చేయించుకోవాలి

గుంతకల్లు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో పంట రుణాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ రెన్యూవల్స్ చేయించుకోవాలని సంఘం సీఈఓ డి.కుళ్లాయప్ప పీరా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రుణాలు పొందిన సభ్యులు కేవైసీ కోసం ఆధారు కార్డు, రేషన్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ కార్డు జిరాక్స్‌లు, మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతోపాటు నామినీ ఆధార్ కార్డును అందజేయాలని సూచించారు.

స్థల విషయంలో మహిళపై దాడి

గుత్తి రూరల్: మండలంలోని మాముడూరు గ్రామంలో స్థలం విషయంలో వరలక్ష్మి అనే మహిళపై శనివారం కొందరు దాడి చేసి గాయపరిచారు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వరలక్ష్మి, మమత కుటుంబాల మధ్య గత కొన్ని నెలలుగా స్థల వివాదం ఉండేది. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగి వరలక్ష్మిపై మమత, కుళ్లాయమ్మ, రామాంజనేయులు, రమేష్‌తో పాటు మరో ఇద్దరు దాడి చేశారు. గాయపడిన ఆమెను కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సెలవులో సీఐ

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి అర్బన్ సీఐగా విధులు నిర్వహిస్తున్నటువంటి నాగేంద్ర ప్రసాద్ సెలవుపై వెళ్లారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ మురళీకృష్ణ ఎన్నికల సందర్భంగా చెలరేగిన ఘర్షణల నేపథ్యంలో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన సీఐ నాగేంద్ర ప్రసాద్ నెల రోజులుపైగా విధులు నిర్వహించారు. తాజాగా సీఐ సెలవుపై వెళ్లారు. అయితే అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జిగా అధికారులు ఎవరినీ నియమించకపోవడం గమనార్హం.

కోన రంగనాథుడికి పూజలు


అలంకరణలో రంగనాథస్వామి

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరుకోన రంగనాథస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత ఆలూరు రంగనాథస్వామిని పట్టువస్త్రాలతో, పూల హారాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నారసింహుడికి ప్రత్యేక పూజలు


వజ్రగిరి లక్ష్మీనరసింహ స్వామి

పెద్దపప్పూరు: మండలంలోని తిమ్మనచెరువు గ్రామ సమీపంలో కొండపై వెలసిన వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేకంగా అలంకరించి అర్చకస్వాములు అభిషేకాలు,ఆకుపూజలు తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులకు అర్చకుడు వెంకటగిరయ్య స్థలపురాణం వివరించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

హెచ్‌ఎం సేవలు ఆదర్శం


హెచ్‌ఎం చంద్రశేఖర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల: సోదనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ గౌడ్ సేవలు ఆదర్శమని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు. ఈనెల 30 న ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో శనివారం పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం సేవలు ఎనలేనివి


లక్ష్మీనారాయణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నార్పల: మండలంలోని ఉయ్యాలకుంట ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ సేవలు ఎనలేనివని వైఎస్సార్‌సీపీ నాయకుడు, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం ప్రధానోపాధ్యాయుడి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆయన వద్ద చదువుకున్న విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత నాల్లో స్థిరపడ్డారన్నారు. అనంతరం హెచ్‌ఎం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ క్రిష్టయ్య, ఉప సర్పంచు శ్రీరాములు, నాయకులు శివయ్య,చికెన్ గోపాల్,రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి, బస్టాండ్ తనిఖీ


బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

నార్పల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలను శనివారం ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలోని మౌలిక వసతులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులను పరామర్శించి, సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, నూతనంగా నిర్మించే కళాశాల భవనాన్ని ఆమె పరిశీలించారు. గాంధీ కూడలి వద్ద డ్రైనేజ్ సమస్యను, ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను త్వరలో పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, నాయకులు ఆకుల విజయబాబు, పిట్టు రంగారెడ్డి, ప్రతాప్‌చౌదరి, జనసేన క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేలం వాయిదా

పామిడి: పామిడి గ్రామ పంచాయితీకి సంబంధించి 2024, జూలై 1 నుంచి 2025 మార్చి 31 వరకూ తొమ్మిది నెలలకు గానూ ఆదాయ వనరులైన పంచాయతీ పన్నుల వసూళ్ల హక్కు వేలం శనివారం వాయిదా పడింది. అనివార్య కారణాల వల్ల ఈవేలం వాయిదా వేసినట్లు ఈఓ పీ చంద్రశేఖర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు వేలం ఎప్పుడు నిర్వహిస్తామన్నది పత్రికాముఖంగా తెలియజేస్తామన్నారు.